సాక్షి 24/7 తూర్పుగోదావరి
శనివారం 12-5-2018

- ఇంజినీరింగ్ ప్రవేశాలపై విద్యార్థుల ఎదురుచూపులు
- కళాశాలలు, కోర్సుల ఎంపికపై తర్జనభర్జన
- కాలేజీ, బ్రాంచిల ఎంపికే కీలకమంటున్న నిపుణులు

# ఎక్కడ చేరాలి! ఏ కోర్సు చేయాలి!!



ఎంసెట్ రాసిన విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ):

ఒకప్పుడు ఇంజినీరింగ్ విద్యలో ప్రవేశాలు ఆగస్టు నెలాఖారుకో లేదా సెప్టెంబర్ నెలలోనే జరిగి, తరగతులు సెప్టెంబర్ చివరి వారం నుంచి ప్రారంభమయ్యేవి. ఇప్పుడు అలా కాదు. ఇప్పటికే ఎంసెట్ ఫలితాలు వచ్చాయి. అభ్యర్థులకు ర్యాంకులు కూడా ప్రకటించేశారు. రెండు మూడు రోజుల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్ నోటిఫికేషన్ కూడా రానుంది. ఈ పరిస్థితుల్లో తమకు వచ్చిన ర్యాంక్ ఆధారంగా ఏ కళాశాలలో, ఏ బ్రాంచిలో సీటు వస్తుందనేదానిపై అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు తర్జనభర్జన పడుతున్నారు. ఏ కోర్సు మంచిదో, ఎక్కడ చేరితే మంచిదనేదానిపై పలువురితో చర్చిస్తున్నారు. అయితే ఏటేటా కోర్సుల ప్రామాణికాలు, ప్రాధాన్యాలు మారిపోతుండటం, ఫలానా కోర్సుకు డిమాండ్ వచ్చిందంటూ ప్రచారం జరుగుతుండడంతో విద్యార్థులు అయోమయానికి గురతున్నారు. కోర్సులు ప్రధానమా, కళాశాల ప్రధానమా, కళాశాలనుబట్టి భవిష్యత్తులో అవకాశాలు వస్తాయా, కోర్సునుబట్టి అవకాశాలు వస్తాయా అన్న దానిపై వారికి స్పష్టత రావడం లేదు. దీంతో ఏ కోర్సు ఎంపిక చేసుకోవాలో, ఏ కళాశాలలో చేరాలో తెలియని గందరగోళం ఏర్పడుతోంది. ఈ పరిస్థితుల్లో ఇంజినీరింగ్‌లో చేరేవారికి కళాశాల ఎంపికతోపాటు, కోర్సు ఎంపిక కూడా కీలకమైనదని పలువురు విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు.

## ఈ అంశాలను తెలుసుకోండి

ఇంజినీరింగ్ విద్యకు సంబంధించి కళాశాల ఎంపికే కీలకమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. జిల్లాలో 32 ఇంజినీరింగ్ కళాశాలలుండగా, వీటిల్లో 12 వేల సీట్లున్నాయి. ప్రతి కళాశాలలో ఒక్కో బ్రాంచ్‌కు 60 నుంచి 120 సీట్లు ఉన్నాయి. పూర్తిస్థాయి స్వయంప్రతిపత్తి ఉందా, లేదా, గత ఏడాది క్యాంపస్ ఇంటర్వ్యూలు ఏవిధంగా జరిగాయి, గ్రంథాలయం, పరిశోధన గదుల వంటివి ఉన్నాయా తదితర అంశాల ఆధారంగా కళాశాలను ఎంపిక చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తమ ఇంటికో లేదా ఊరికో దగ్గరగా ఉంటుందని కాకుండా నాణ్యమైన విద్యను అందించే కళాశాలను ఎంపిక చేసుకోవాలి.

## ఆసక్తి లేని కోర్సుల్లో వద్దు

కళాశాల ఎంపికతోపాటు వాటిల్లో బ్రాంచి ఎంపిక కూడా కీలకమే. ఎంసెట్ అయినప్పటి నుంచి ఇంజినీరింగ్ విద్యలో ఏ కోర్సు మంచిదని దాదాపు అందరూ ఆరా తీస్తుంటారు. చివరకు అన్ని నదులూ సముద్రంలో చేరుతున్నట్టు.. ఎక్కువమంది సాఫ్ట్‌వేర్ వైపే మొగ్గు చూపుతున్నారు. కోర్ బ్రాంచ్‌ల ఆధారంగా ఉద్యోగాన్వేషణ చేస్తున్నవారి సంఖ్య చాలా తక్కువగా ఉంటోందని అధ్యాపకులు అంటున్నారు. ఒక ఏడాది మెకానికల్, మరో ఏడాది సీఎస్ఈ వంటి వాటికి డిమాండ్ ఉందని చాలామంది అంటుంటారు. కానీ దానికి ప్రామాణికం ఏదనే ప్రశ్నకు సమాధానం ఉండదు. అన్ని కోర్సుల మంచివేనని, విద్యార్థి ఆసక్తినిబట్టే కోర్సును ఎంపిక చేసుకోవాలని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. ఆసక్తి లేని కోర్సుల్లో చేర్పిస్తే విద్యార్థి ఒత్తిడికి గురై మొదటికే మోసం వస్తుందని చెబుతున్నారు.

## విద్యేతర అంశాలపై దృష్టి సారించాలి

ఇంజినీరింగ్ అంటే కేవలం కోర్సు సబ్జెక్టులే కాదు. ఇతర అంశాలకూ కూడా ప్రాధాన్యం ఉంటుంది. ఇటీవల జరుగుతున్న క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యేతర అంశాలకే ఎక్కువ అవకాశాలుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఎంపిక చేసుకొనే కళాశాలల్లో ఇంక్యుబేషన్ సెంటర్‌తో పాటు స్టార్టప్ నిర్వహణకు అవకాశం ఉందో లేదో చూసుకోవాలి. పరిశోధనలు చేసేందుకు అవసరమైన సౌకర్యాలు ఉన్నాయో లేవో చూడాలి. వికాసం కోసం క్రీడలు, హ్యాపీ క్లబ్బులు, ర్యాగింగ్ నిషేధం వంటి వాటిని పరిశీలించుకోవాలి.

### ఆసక్తి ఉన్న బ్రాంచ్ ఎంపిక చేసుకోవాలి



మొదట ఆసక్తి ఉన్న బ్రాంచ్‌ను ఎంపిక చేసుకోవడం కీలకం. తరువాత కళాశాలను ఎంపిక చేసుకోవాలి. నాక్ గుర్తింపుతోపాటు ఎన్‌బీఏ ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా వంటి విషయాలను పూర్వ విద్యార్థుల నుంచి తెలుసుకోవాలి. కౌన్సెలింగ్ సమయంలో వెబ్ ఆప్షన్లు ఇచ్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. గత ఏడాది ఏయే కళాశాలల్లో ఏయే బ్రాంచ్‌లలో ఏ సీటు వచ్చిందనే విషయం తెలుసుకోవాలి.

– సీహెచ్.సాయిబాబు, ఏపీ ఎంసెట్ కన్వీనర్

### ప్రాధాన్యం గుర్తించాలి



ఇంజినీరింగ్ విద్యకు సంబంధించి విద్యార్థి దేన్ని ప్రాధాన్యంగా తీసుకుంటారో చూసుకోవాలి. కోర్సు ఎంపిక, కళాశాల ప్రాధాన్యాన్ని ముందుగానే గుర్తించాలి. తల్లిదండ్రుల ఒత్తిడికన్నా విద్యార్థి ఆసక్తే కీలకం. పాఠ్యాంశాలతో పాటు ఇతర అంశాలపై కూడా దృష్టి సారించేందుకు అవసరమైన వాతావరణం ముఖ్యం. పరిశోధనలు, ప్రయత్నాలు, ఇంజినీరింగ్ విద్యకు కీలకం. అదేవిధంగా కళాశాల చరిత్ర, ప్లేస్‌మెంట్లు చూసుకోవాలి. ఏ కోర్సు అయినా ఒకటే కానీ విద్యార్థి ఆసక్తే అన్నింటికన్నా ముఖ్యం.

– జీవీఆర్ ప్రసాద్‌రాజు, ప్రిన్సిపాల్, జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాల

### కళాశాల ప్రగతిని గమనించాలి



ఇంజినీరింగ్ విద్య పలుచబడిందనే ప్రచారం అవాస్తవం. దేశంలో ఏ ఇతర బ్యాచిలర్ డిగ్రీ కోర్సులతో పోల్చుకున్నా తల్లిదండ్రులు, విద్యార్థుల దృష్టి ఇంజినీరింగ్ పైనే ఉంటుంది. ఈ విద్యకే భవిష్యత్తు ఉంటుంది. అయితే కోర్సు లక్ష్యాన్ని విద్యార్థి చేరాలి. దానికి తగ్గట్టుగా సమాయత్తమై పరిస్థితులను అవగాహన చేసుకోవడంతో ఉత్తమ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ముఖ్యంగా ఆ కళాశాల అధ్యాపకుల విద్యార్హతలు, ప్లేస్‌మెంట్ ప్రగతి, సిలబస్ సకాలంలో పూర్తయ్యే విధానం, పూర్వ విద్యార్థుల నుంచి అభిప్రాయాలు తెలుసుకోవాలి.

– పరుచూరి కృష్ణారావు, చైర్మన్, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల

### కోర్సుపై అవగాహన అవసరం



ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరే అభ్యర్థులు వారు చేయబోయే కోర్సులు, అవకాశాలు, పరిశోధనలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలి. మనం చేరబోయే కోర్సుపై అవగాహనతోపాటు మన అభిరుచి మేరకు కోర్సును ఎంపిక చేసుకోవాలి. గణితంపై ఆసక్తి ఉన్నవారు మెకానికల్, సీఎస్ఈ; భౌతికశాస్త్రంపై ఆసక్తి ఉన్నవారు ఈసీఈ, ఈఈఈ; సివిల్ డ్రాయింగ్‌పై ఆసక్తి ఉన్నవారు సివిల్ కోర్సులను ఎంపిక చేసుకోవాలి.

– ఎ.గోపాలకృష్ణ, డైరెక్టర్, డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్